తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం


పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 149

శుక్రవారం 31, అక్టోబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥


## జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు



హైదరాబాద్,అక్టోబర్ 30(అక్షరగళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు.



## ధాన్యాన్ని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు

- ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ
- ప్రతి ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు
- ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సమీక్షించాలి
- వరంగల్‌లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలు
- కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, అక్టోబర్ 30(అక్షరగళం): తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు.

తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, మిగతా..2లో

## ఎస్డీఆర్ఎఫ్, టిఆర్ నిధులు వాడుకోండి

- నిధుల సమస్య లేదు
- అప్రమత్తతతో ప్రమాదాన్ని నివారించగలిగాము
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్: తుఫాను నేపథ్యంలో సహాయ, పునరావాస చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టర్లు ఎస్డీఆర్ఎఫ్, టిఆర్ నిధులు వాడుకొని, తదుపరి 30 రోజుల్లో ర్యాటిఫై చేసుకోవాలని, నిధులకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదని కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. మిగతా..2లో

## తుపాను నష్టం రూ.5,265 కోట్లు

- వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు
- ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం
- ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం
- సకాలంలో విద్యుత్ పునరుద్ధరించాం
- అధికారులు సమన్వయంతో పనిచేయడంతో తప్పిన ముప్పు
- అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు




అమరావతి,అక్టోబర్ 30(అక్షరగళం): 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ. 5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 829 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ. 2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. తుపాను వల్ల మిగతా..2లో

## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

- అజారుద్దీన్ కోసం ప్రత్యేకం
- రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు



హైదరాబాద్తె,అక్టోబర్ 30(అక్షరగళం): తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. మిగతా..2లో

## అజారుద్దీన్‌పై ఎందుకీ అక్కసు..?

- బిజెపి తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- దేశానికి కీర్తి తెచ్చిన ఘనత అజ్జాదన్న భట్టి
- బిజెపి విమర్శలను కొట్టి పారేసిన పిసిసి చీఫ్



హైదరాబాద్తె,అక్టోబర్ 30(అక్షరగళం): మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవద్దని లేఖలు రాస్తున్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారుడని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచపటంలో నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా మిగతా..2లో

## అజారుద్దీన్‌పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర

- గతంలో రాజస్థాన్‌లో ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రి వర్గంలోకి తీసుకుంది
- బీఆర్ఎస్‌కు లాభం చేయడం కోసం చాలా లేట్‌గా బలహీనమైన అభ్యర్థిని బీజేపీ ప్రకటించింది
- గాంధీభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, అక్టోబర్ 30(అక్షరగళం): మహమ్మద్ అజారుద్దీన్‌ను రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసు కోకుండా బీజేపీ కుట్రలు చేస్తోంది. అజారుద్దీన్ దేశ క్రికెట్ జట్టుకు సుధీర్ఘ కాలం కెప్టెన్ గా వ్యవహరించారు. క్రికెట్ లో దేశానికి ఎంతో సేవ చేశారు. దేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన క్రీడాకారుల్లో అజారుద్దీన్ ఒకరు.అజారుద్దీన్ లాంటి విఖ్యాత క్రీడా కారుడికి మంత్రి వర్గంలో అవకాశం కల్పిస్తుంటే బీజేపీ అడ్డుకుంటోంది. అజారుద్దీన్ పైన బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయి. బీజేపీ,




బీఆర్ఎస్ తెర వెనుక బంధం గురించి ఇప్పటికే కల్వకుంట్ల కవిత స్పష్టం చేసింది. వీరిద్దరి తెర వెనక బంధాన్ని ఆమె బయటపెట్టింది. గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ ఎస్ సహకారంతోనే మిగతా..2లో

## తన రాజకీయ జీవితంపై బురదజల్లే యత్నం

- తనచూ పార్టీ మారుతున్నారంటూ దుష్ప్రచారం
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అసహనం



యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 30(అక్షరగళం): తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఖండించారు. రాజకీయంగా తాను ఏదైనా నిర్ణయం తీసుకోవాలను కున్నప్పుడు ఆయనే ప్రెస్ మీట్ పెట్టి చెబుతాను అంటూ క్లారిటీ ఇచ్చారు. పార్టీ మార్పు అంటూ తప్పుడు ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా..2లో

## జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసే చర్య

- మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి
- అజారుద్దీన్‌కు పదవి కేవలం మైనార్టీలను దువ్వడమే
- ఎన్నికల అధికారికి బిజెపి నేతల ఫిర్యాదు

హైదరాబాద్,అక్టోబర్30(అక్షరగళం): జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసేలా చేస్తున్న మంత్రివర్గ విస్తరణను ఆపాలని బిజెపి ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇది కేవలం ఓ వర్గం వారిని మచ్చిక చేసుకునే చర్య తప్ప మరోటి కాదని పేర్కొంది. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారని విమర్శించారు. అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ



చేశారని భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను ఆపాలని సీఈవోను కోరారు. తెలంగాణ భాజపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోందని అందులో పేర్కొన్నారు. మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్ణయించారు. ఈ నెల 31న విస్తరణకు అవకాశం ఉందని, అజారుద్దీన్‌కు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ మిగతా..2లో



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ,అక్టోబర్ 30(అక్షరగళం): సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో మిగతా..2లో




## గోవుల అక్రమ రవాణా మాఫియాకు మజ్లిస్ అండ

- మజ్లిస్ తెలంగాణకు, దేశానికి పట్టిన చీడపురుగు
- పశువులను మత్తు ఇంజక్షన్లు ఇచ్చి వాహనాల్లో ఎత్తుకెళ్లే ముఠాలు
- గోరక్షకుల పైనే కేసులు బనాయిస్తున్నారు
- పోలీసులు చేయాల్సిన రక్షణ బాధ్యత గోరక్షకులు నిర్వర్తిస్తున్నారు
- బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఇల్లీగల్ కార్మికులు పనిచేస్తూ గోవుల అక్రమ రవాణాలో కీలక పాత్ర
- ఇబ్రహీం ఖురేషీ అనేక నేరాల్లో రాటుదేలిన వ్యక్తి
- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో ఇబ్రహీం ఖురేషీకి సన్నిహిత సంబంధాలు
- తెలంగాణలోని అనేక అటవీ ప్రాంతాల్లో అక్రమ స్లాటర్ హౌసులు
- కోడ్ అమల్లో ఉన్నప్పుడు మంత్రి పదవిని ఇవ్వడం చట్ట విరుద్ధం
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదు?
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 30(అక్షరగళం): ఘట్‌కేసర్‌లో గోరక్షక్ సేవకుడు ప్రశాంత్ కుమార్ (సోనూసింగ్)పై మజ్లిస్ పార్టీ నాయకుడు ఇబ్రహీం ఖురేషీ తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన సంచలనం రేపింది. ఈ ఘటనను బీజేపీ తీవ్రంగా ఖండించింది. మేము స్వయంగా హాస్పిటల్‌లో ప్రశాంత్‌కు సకాలంలో వైద్యం అందేలా డాక్టర్లతో మాట్లాడి చర్యలు తీసుకున్నాం. రాచకొండ కమిషనర్ ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి, మరొకరు పరారీలో ఉన్నారని తెలిపారు. కీసర మండలం రాంపల్లికి చెందిన ప్రశాంత్ (సోనుసింగ్) అనేక సంవత్సరాలుగా గోరక్షణ కోసం పనిచేస్తున్న మిగతా..2లో

# తుపాను నష్టం రూ.5,265 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువే ఉందన్నారు. తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నష్టం వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని, ఇంటినీ జియోట్యాగింగ్ చేయగలిగాం. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నాం. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగింది. అధికారులు అందరూ నిబద్ధతతో పని చేశారు. చాలా సంతోషంగా ఉందన్నారు. . ఓ వైపు వర్షం పడుతున్నా.. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారు. గతంలో చెట్లు కూలితే.. తొలగించేందుకు వారం పట్టేది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు.. ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాన్ మనతో దాగుడుమూతలు ఆడి.. సమస్యలు సృష్టించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అయితే టెక్నాలజీ సాయంతో ఈ తుపాన్ నష్టాన్ని తగ్గించామని ఆయన చెప్పారు. అంతర్వేది వద్ద తీరం దాటడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుపాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. అంతర్వేది వద్ద తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు.అయితే కాకినాడలో ఈ తుపాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సీఎం చంద్రబాబు వివరించారు. వారం రోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని.. అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు. ఈ తుపాన్ తీరం దాటినా.. తెలంగాణలో వర్షాలు అధికంగా కురిశాయని తెలిపారు. గతంలో బుడమేరు వరదను సైతం ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు. విపత్తుల సమయంలో అన్నింటినీ సరిచేశామని చెప్పారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు కోరారు. ఐదు రోజుల్లో పంట నష్టంపై నివేదిక అందజేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తుపాన్ కారణంగా.. వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే.

# ధాన్యాన్ని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీని వాసులు. విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో పాటు తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని చెప్పారు.

వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కళ్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఇన్చార్జి అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్చార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని కలెక్టర్లను సూచించారు. ప్రతి ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్ట్ తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవిన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని నివేదించారు.

తుఫాను, వర్షాల ప్రభావమున్న జిల్లాల్లో చేపడుతున్న సహాయక చర్యలు, రోడ్లు, రహదారుల పునరుద్ధరణ చర్యలు ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సమీక్షించాలని సీఎం కోరారు. తమ సొంత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ఇన్చార్జీగా ఉన్న జిల్లాల్లో ప్రజలను ఆదుకునే చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చెప్పారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు.

వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాలతో ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు.

రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సీఐ, రెవెన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపుల బారికేడ్లు పెట్టాలన్నారు.

దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసు సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు.

వరంగల్ లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు.

హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 9 రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేసి రెండు వేల మందిని వరంగల్ లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్ లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ సెల్ను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి వర్షాలు, వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

## నేడు సీఎం ఏరియల్ సర్వే

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రేపు ఉదయం వరంగల్, హుస్నాబాద్ వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, పంట నష్టం వాటిల్లిన ప్రాంతాలను సీఎం పరిశీలిస్తారు. గురువారం ఉదయమే వరద ప్రభావిత జిల్లాలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి సిద్ధపడ్డారు. ఆఖరి నిమిషంలో సీఎం పర్యటన రద్దయింది.

వాతావరణం అనుకూలించకపోవటంతో హెలికాప్టర్ ప్రయాణం వీలు కాదని ఏరియల్ సర్వేకు అధికారులు అనుమతించలేదు. ఈరోజు వాతావరణం అనుకూలించకపోవటంతో తాను రాలేకపోయానని, శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వేకు వస్తానని వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం ప్రకటించారు.

# గోవుల అక్రమ రవాణా మాఫియాకు మజ్లిస్ అండ

(మొదటి పేజీ తరువాయి)

సేకుడు. పోలీసులు చేయాల్సిన రక్షణ బాధ్యత గోరక్షకులు నిర్వర్తిస్తున్నారు. కానీ చట్టాన్ని ఉల్లంఘించి గోవులను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, గోరక్షకులపైనే అక్రమ కేసులు బనాయించి బెదిరిస్తున్నారు. ఇటువంటి ఘటనలు హైదరాబాద్ చుట్టుపక్కల విస్తారంగా పెరుగుతున్నాయి. గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో పోలీసులు ధైర్యంగా చర్యలు తీసుకుంటే, వెంటనే ఎంఐఎం నాయకులు ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి ఒత్తిళ్లు తెస్తున్నారు. ఘట్‌కేసర్ ఘటనలో మజ్లిస్ నాయకులు తుపాకులతో దాడి చేసే స్థాయికి దిగజారారు.

ఇబ్రహీం ఖురేషీపై చత్తీస్‌గఢ్‌లో కూడా అనేక కేసులు నమోద య్యాయి. ఆయన విడుదల తర్వాత కొంతమంది ఎంఐఎం నాయకులు, హైదరాబాద్ విమానాశ్రయం వద్ద అతనిని ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆందోళన కలిగించే విషయం. మెజారిటీ ప్రజలు గోవులను పూజిస్తారు. వారి భావాలను గుర్తించి గోహత్యపై నిషేధం విధించబడింది. స్లాటర్ హౌసుల నియంత్రణకు పలు చట్టాలు, నిబంధనలు తీసుకువచ్చారు. కానీ ఈ చట్టాలు, నిబంధనలు గత పది సంవత్సరాలుగా తెలంగాణలో అమలు కావడం లేదు. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన పోలీసులు, మాఫియా చేతుల్లో కీలుబొమ్మలుగా మారి గోరక్షకులపైనే కేసులు బనాయిస్తున్నారు. పోలీసు వ్యవస్థ పూర్తిగా వైఫల్యానికి గురైంది. గోవులను రక్షించుకోవడం ప్రతి పౌరుడికి చట్టం కల్పించిన హక్కు. కానీ అక్రమ స్లాటర్ హౌసుల్లో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ఇల్లీగల్ కార్మికులు పనిచేస్తూ గోవుల అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మాఫియాకు అండగా ఉన్నది మజ్లిస్ పార్టీ నాయకులే.

ఇబ్రహీం ఖురేషీ అనేక నేరాల్లో రాటుదేలిన వ్యక్తి. ఆయనపై శంషాబాద్, ఘట్‌కేసర్, గజ్వేల్, ములుగు వంటి ప్రాంతాల్లో అనేక క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇబ్రహీం ఖురేషీ ఎంఐఎం పార్టీ నాయకులతో సన్నిహితంగా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కూడా అతనికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు మజ్లిస్ మద్దతుదారులే చెబుతున్నారు.

గోవుల అక్రమ రవాణా సమయంలో పోలీసులు వాహనాలను సీజ్ చేస్తే, వాటిని విడిపించడానికి ఎంఐఎం పార్టీ ఆఫీసులో ప్రత్యేకంగా ఒక సెల్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలో గోవుల అక్రమ రవాణా, గోహత్య, పశుమాంస ఎగుమతి పెద్ద మాఫియాగా మారింది. ఎంఐఎం పార్టీకి చెందిన బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, రసూల్‌పురా కార్పొరేటర్ మహ్మద్ ఖాదర్ వంటి వారు రెగ్యులర్‌గా పోలీసు స్టేషన్లకు వెళ్లి అధికారులను బెదిరించి వాహనాలను విడిపించడం సాధారణంగా మారింది.

తెలంగాణలోని పశువుల సంతల నుంచి ఇతర రాష్ట్రాలకు దొంగతనంగా పశువులను తరలిస్తున్నారు. రైతుల పంట పొలాల నుంచి పశువులను ఎత్తుకెళ్లి ఎగుమతి చేస్తున్నారు. దీనిపై అనేక ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి.

మజ్లిస్ పార్టీ పెత్తనం వల్ల, రాష్ట్ర ప్రభుత్వం ఎంఐఎం ఆదేశాలతో నడుస్తుండటంతో ఈ అక్రమాలు విస్తరించాయి. పశువులను మత్తు ఇంజక్షన్లు ఇచ్చి వాహనాల్లో ఎక్కిస్తే మూలాలు పనిచేస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రం నుంచి సరిహద్దులు దాటి తెలంగాణకు తెస్తున్నారు.

మెజారిటీ ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం చట్టవ్యతిరేకం. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కూడా అక్రమ స్లాటర్ హౌసుల్లో భాగస్వాములు. మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్,.. హజ్ కమిటీ మాజీ చైర్మన్ మహ్మద్ సలీం బీఆర్ఎస్ హయాంలో స్లాటర్ హౌస్ అక్రమాల ద్వారా వేల కోట్లు సంపాదించాడు. ఇబ్రహీం ఖురేషీతో అతనికి సత్సం బంధాలు ఉన్నాయి. ప్రస్తుతం మహ్మద్ సలీం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ప్రచారం చేస్తున్నారు. మజ్లిస్ పార్టీ ఏది చెబితే, కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలు అదే విధంగా అమలు చేస్తున్నాయి. ఈ పార్టీల కారణంగా తెలంగాణలో వేలాది గోవులు హత్యకు గురవుతు న్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రాత్రికి రాత్రి అక్రమంగా పశువులను తెలంగాణకు తెస్తున్నారు. ఇందులో ఇబ్రహీం ఖురేషీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఖురేషీ ఉపయోగిస్తున్న రివాల్వర్ చత్తీస్‌గఢ్ నుంచి అక్రమంగా తెచ్చుకున్నదే.

తెలంగాణలోని అనేక అటవీ ప్రాంతాల్లో అక్రమ స్లాటర్ హౌసులు నడుస్తున్నాయి. హైదరాబాద్‌లో న్యూ బోయిగూడ, గోల్నాక ప్రాంతాల్లో కూడా స్లాటర్ హౌసులు పనిచేస్తున్నాయి. ఈ రెండు కేంద్రాలను కూడా వెంటనే నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. గోరక్షణ చట్టాలను కచ్చితంగా అమలు అయ్యేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం పాటించాలి.

తెలంగాణలో 39 అక్రమ స్లాటర్ హౌసులపై నేను గతంలో ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీకి లేఖలు రాశాను. ఇప్పటివరకు వాటిపై ఎన్ని చర్యలు తీసుకున్నారో వెల్లడించాలి. ఒక వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా, చట్టాలను ఉల్లంఘించేలా మజ్లిస్ పార్టీ వ్యవహరిస్తోంది. వారికి ఆ హక్కు ఎవరు ఇచ్చారు? మజ్లిస్ పార్టీ కనుసన్నల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంది. ఇదే విధంగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నడిచింది.

మజ్లిస్ పార్టీ తెలంగాణకు, దేశానికి పట్టిన చీడపురుగు. రజాకార్ల వారసత్వాన్ని మోస్తున్న ఈ పార్టీ ఇప్పుడు హిందువుల మనోభావాలతో చెలగాటమాడుతోంది. మజ్లిస్ పార్టీ హైదరాబాద్‌లో రాజ్యాంగేతర శక్తిగా ఎదుగుతోంది. మజ్లిస్ ఆదేశాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు "జీ హుజూర్" అంటూ అమలు చేస్తున్నాయి. ఒకప్పుడు పాతబస్తీకి మాత్రమే పరిమితమైన మజ్లిస్ పార్టీ, ఇప్పుడు తెలంగాణ అంతటా వ్యాపించే స్థితికి చేరింది. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అనేకసార్లు మజ్లిస్ పార్టీని పొగిడారు. ఒవైసీ తో కలిసి దేశమంతా తిరిగి బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేస్తామని చెప్పారు. ఇప్పుడు ఆయన ఫార్మ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేసీఆర్ తర్వాత ఇప్పుడు ఆ బాధ్యతను రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో 2014లో ఎంఐఎం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తిని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీకి దింపారు. ఈ అభ్యర్థి ఎంపిక గాంధీభవన్‌లో కాదు, దారుస్సలాం ఆదేశాలతోనే జరిగింది.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన రోజే కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ ఆదేశాలతో మిలటరీ భూమిని ఖబ్రస్తాన్‌కు కేటాయించింది. అలాగే ఎర్రగడ్డలో కూడా ఇల్లీగల్‌గా ఖబ్రస్తాన్‌లకు భూములు కేటాయించారు. బీఆర్ఎస్‌ను గద్దె దింపిన తర్వాత మజ్లిస్ కాంగ్రెస్‌తో పంచన చేరింది. ఇప్పుడు ఈ రెండు పార్టీలు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ముసుగులో మజ్లిస్ పార్టీ అభ్యర్థే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు.

గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన అజారుద్దీన్‌ను ఇప్పుడు హడావుడిగా మంత్రిగా చేయాలని నిర్ణయించారు. 22 నెలలుగా మంత్రివర్గంలో ఒక్క మైనారిటీ వర్గానికి చెందిన మంత్రి కూడా లేరు. నిజంగా మైనారిటీ సంక్షేమంపై శ్రద్ధ ఉంటే ముందే అవకాశం ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఎన్నికల ముందు గుర్తుకొచ్చిందా? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు మంత్రి పదవిని ఇవ్వడం చట్ట విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ ఇంతగా దిగజారింది.

కేవలం మైనారిటీ ఓటర్ల సంతుష్టీకరణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోంది. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ఖబ్రస్తాన్ భూములు, మంత్రి పదవులు తాయిలాలుగా ఉపయోగిస్తోంది. ఓవైసీ కనపడితే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వంగి వంగి సలాం కొడుతున్నాయి. కుహనా లౌకికవాదం, బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్%–%బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్‌కు రక్షణ కవచంలా వ్యవహరిస్తున్నాయి.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదు? ఎవరి ఒత్తిళ్లతో, ఎవరి సూట్ కేసులకు తలొగ్గి తమ అభ్యర్థిని కాంగ్రెస్‌కు అద్దెకు ఇచ్చింది?

మంత్రులను బస్తీలకు పంపించి, మజ్లిస్ నాయకులు ప్రత్యర్థులపై దాడులు, బెదిరింపులు చేస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ బీజేపీ అభ్యర్థులపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరం.

# జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసే చర్య

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరగవచ్చని కూడా తెలుస్తోంది. ఈక్రమంలో సీఈవోను భాజపా నేతలు కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయ న్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని అంటూ పాయల్ శంకర్ అన్నారు. ఒకవేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలి అనుకుంటే ఎన్నిక తర్వాత ఇవ్వాలి. కానీ ఉన్నఫళంగా మంత్రివర్గ విస్తరణ చేయడం, అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. మర్రి శషిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల లబ్ది కోసం ఒక వర్గం ఓట్లు కోసం అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తున్నారు. ఆ వర్గంపై ప్రేమ ఉంటే గతంలో ఎందుకు ఇవ్వలేదు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలంటూ కోరాం. సినీ కార్మికులను ప్రభావితం చేసేలా ప్రకటనలు చేయడంకోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు.

# అజారుద్దీన్‌పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ రాష్టంలో 8 సీట్లు గెలుచుకుంది. జూబ్లీ హిల్స్ లో తమకు గెలిచే అవకాశం లేదని బీజేపీ కి తెలుసు. అందుకే బీఆర్ఎస్‌కు లాభం చేయడం కోసం చాలా లేట్‌గా బలహీ నమైన అభ్యర్థి ని బీజేపీ ప్రకటించింది. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలు ఎవరూ బీజేపీ కి ఓటు వేయరు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు లాభం కల్గించడం కోసమే అజారుద్దీన్ ను మంత్రి కాకుండా బీజేపీ అడ్డుకుంటోంది. అజారుద్దీన్‌తో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్ర గవర్నర్ పైన బీజేపీ ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. నాకున్న సమాచారం మేరకు వారు గొప్ప వ్యక్తి అలా చేయరు అని భావిస్తున్నాను. కుట్రలో భాగంగా ఎన్నికల కమిషన్ కు బీజేపీ ఫిర్యాదు చేసింది. గతంలో రాజస్థాన్ లో ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రి వర్గంలోకి తీసుకుంది. శ్రీ గంగానగర్ జిల్లా శ్రీ కరణ్ పూర్ నియోజకవర్గం ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థిగా ఉన్న సురేంద్ర పాల్ సింగ్. డిసెంబర్ 30 న ఆయనతో రాష్ట్ర మంత్రి వర్గంలోకి ఏకంగా ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రి వర్గంలోకి బీజేపీ తీసుకుంది. ఉప ఎన్నికకు 20 రోజుల ముందు ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు.

## బీజేపీ ద్వంద్వ ప్రమాణాలకు ఇది నిదర్శనం.

కేవలం మైనార్టీ అన్న ద్వేషంతోనే బీజేపీ అజారుద్దీన్ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటోంది. బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర లను మైనార్టీలు అర్థం చేసుకోవాలి. బై ఎలక్షన్ కేవలం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వరకే. ప్రమాణ స్వీకారం నియోజకవర్గం బయట జరుగుతుంది. అజారుద్దీన్ జూబ్లీహిల్స్ లో పోటీ చేయడం లేదు. ఇప్పటికే ఆయన ఎమ్మెల్సీ. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా సమాజంలోని అన్ని వర్గాలకు భాగస్వామ్యం కల్పించడం కాంగ్రెస్ మూల సిద్ధాంతం. ఈ క్రమంలో అజారుద్దీన్ కు కల్పిస్తున్న అవకాశంపై కుట్రలు చేయడానికి ఖండిస్తున్నాను. రాష్ట్ర మంత్రుల మధ్య స్పష్టమైన అవగాహన, ఆలోచన, ప్రణాళిక నిర్ణయాల పట్ల నిబద్ధత ఉన్నాయి తుఫానుకు సంబంధించి ప్రభుత్వం 46 గంటల ముందే అప్ర మత్తమయింది 24 గంటలు పనిచేసింది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్, చీఫ్ సెక్రటరీతో పాటు మొత్తం యంత్రాంగం అప్ర మత్తమై కావలసిన చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ముందస్తు చర్యల మూలంగా భారీ ప్రాణ, ఆస్తి, ఇతర నష్టం జరగకుండా చూడగలిగాం. అన్ని ప్రయత్నాలు చేసినా ప్రకృతి విపత్తు వల్ల కొన్ని నష్టాలు జరుగుతాయి. నష్టాలు అంచనా వేసి నష్టపోయిన వారికి సహాయం చేస్తాం. తుఫాను నష్టంపై ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో ఆలోచన చేస్తుంది.

# ఎస్డీఆర్ఎఫ్, టిఆర్ నిధులు వాడుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ 48 గంటలు ముందుగా అందరినీ అలర్ట్ చేయడం, ప్రభుత్వ యంత్రాంగం అందుకు అనుగుణంగా స్పందించడంతో ప్రాణ నష్టాన్ని, భారీ ఆస్తి నష్టం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోగలిగామని డిప్యూటీ సీఎం అన్నారు. రాబోయే 24 గంటలు కలెక్టర్లు ఇతర అధికారులు సైక్లోన్, మాన్యువల్ దగ్గర పెట్టుకొని సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం వివరించారు.

తుఫాను ప్రభావం దురదృష్టకరం, కృష్ణాజిల్లా నుంచి నల్లగొండ, ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లడంతో ఉత్తర తెలంగాణలో ఇబ్బందికర పరిస్థి తులు ఏర్పడ్డాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అధికారులు అప్ర మత్తమై పత్తి తడవకుండా టార్పాలిన్లు కప్పడం, గోదాముల్లోకి పత్తి పంటను షిఫ్ట్ చేయడంతో పత్తి పంటను కాపాడుకోగలిగం అన్నారు. తుఫాను నేపథ్యంలో ఉత్తర, దక్షిణ సీఎండీలు మొదలుకొని విద్యుత్ శాఖ యావత్తు తుఫాను సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. భారీ తుఫాను వచ్చినప్పటికీ ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్త కుండా మొబైల్ వ్యాన్లు పెట్టుకొని సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు వెళ్లారని డిప్యూటీ సీఎం వివరించారు. తుఫాను నేపథ్యంలో రెండు డిస్కొంట్ పరిధిలో 11. 33/11 కె.వి సబ్ స్టేషన్లు దెబ్బతినగా ఏడు సబ్ స్టేషన్‌లను తిరిగి పునరుద్ధరించారు కొద్దిగంటల్లో మిగిలిన నాలుగు సబ్ స్టేషన్లను పునరుద్ధరిస్తారని వివరించారు. 101. 33 కెవి లైన్లు దెబ్బతినగా అందులో 96 లైన్లను ఇప్పటికే పునరుద్ధరించారు. ఈరోజు మిగిలిన 5 లైన్లను పునరుద్ధరిస్తారని వివరించారు. 11 కెవి లైన్లు 237 డామేజ్ కాగా ఇప్పటికే 227 లైన్లను పున రుద్ధరించారని వివరించారు. DTR(డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్) లు 171 దెబ్బతినగా 49 ప్రాంతాల్లో పునరుద్ధరించారు మరో 122 ట్రాన్స్ఫార్మర్లను కొద్ది గంటల్లో పునరుద్ధరిస్తారని డిప్యూటీ సీఎం వివరించారు. 638 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 304 విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు మరో 334 కొద్ది గంటల్లో పునరుద్ధరిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.

# అజారుద్దీన్‌పై ఎందుకీ అక్కసు..?

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిగా చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పిసిసి చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దిన్‌ను కేబినేట్‌లోకి తీసుకుంటే బిజెపికి వచ్చిన నొప్పి ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌లవి ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# తన రాజకీయ జీవితంపై బురదజల్లే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని లక్కారం, చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని చెరువులను పరిశీలించి గంగ పూజను నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని చెరువు నిండినప్పుడు కాలనీలు జలమయం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం, రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..' చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి 500 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపుదిద్ద బోతున్నాం. చౌటుప్పల్ చెరువుకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా ప్రణాళికలు వేసి దండు మల్కాపురం, లక్కారం వద్ద వరద నీటిని డైవర్ట్ చేయడంతో మున్సిపాలిటీ ప్రజలకు వరద ముప్పు తప్పిందని తెలిపారు. ర్టీ మారుతున్నానని సొంత పార్టీ వాళ్లు, బయట పార్టీ వాళ్లు నాపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు దుష్ప్రచారాలను ఎవరు నమ్మవద్దు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్

## మీ సేవ సెంటర్ లైసెన్స్ రద్దు



**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
ఆమనగల్లు పట్టణంలో నిర్వహిస్తున్న కిషోర్ కమ్యూనికేషన్ మీసేవ సెంటర్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేసినట్లు తహశీల్దార్ మహమ్మద్ ఫహీం ఖాద్రి చెప్పారు.
గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మీసేవ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 27 నుంచి రద్దు చేసినట్లు ఆయన వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆ సెంటర్లో ఎలాంటి కార్యకలాపాలు చేయవద్దని సూచించారు.



## ఆడబిడ్డ పెండ్లికి అండగా నిలిచిన గోదాదేవి సత్యం

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
ఆమనగల్లు మండలం శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి గ్రామంలో ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఆర్థిక సాయం చేస్తు పేదింటి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. గురువారం శెట్టిపల్లికి చెందిన మైబమ్మ శ్రీను దంపతుల కుమార్తె శ్రావణి రూ.10,116 నగదును పెళ్లి కానుకగా అందజేశారు. ఇప్పటి వరకు గ్రామంలో 95 మంది ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఆర్థిక సాయం అందించినట్లు మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, టీ. వెంకటయ్య, గణేష్, వెంకటయ్య, రామ్మోహన్, జంగయ్య, వెంకటయ్య, మహేష్, జంగయ్య, వెంకటేష్, సాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ


**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన కొమ్ము వెంకటయ్య ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య గురువారం మృతుడి కుమారులు



ప్రవీణ్, ప్రదీప్, నవీన్ లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట పులికంటి చిన్న మైసయ్య, పురుషోత్తం, కృష్ణయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

## ప్రముఖ బిల్డర్ స్వర్గీయ పొలిశెట్టి బాబురావుకు ఘనంగా నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 30, (అక్షర గళం):**
ఏఎస్ రావునగర్ కు చెందిన ప్రముఖ బిల్డర్, క్రాంతి బిల్డర్స్ ప్రొప్రైటర్ పోలిశెట్టి బాబురావు దశదినకర్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



పలువురు ప్రముఖులు బాబురావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భాను ప్రసాద్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, నాయకులు బండారి నీలం రెడ్డి, దామోదర్ రావు, పోలిశెట్టి శ్రీనివాస్, పోలిశెట్టి రవి, పోలిశెట్టి కళ్యాణ్, మధు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
తలకొండపల్లి మండల పరిధిలోని చౌరస్తాలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.



కడ్తాల్ మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన బాలమోని జంగయ్య ఆయన కుమారుడు శివలు తలకొండపల్లిలో వివాహానికి వెళ్లి వస్తుండగా తలకొండపల్లి చౌరస్తాలో టిప్పర్ లారీని వెనక నుండి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జంగయ్య, శివ లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం యూసుఫ్ గూడాలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.. జూబ్లీహిల్స్ ప్రజలకు అభివృద్ధి సంక్షేమం అందించే నాయకుడు నవీన్ యాదవ్ అని, యువ నాయకుడు ప్రజలకు చేరువైన వ్యక్తి కాబట్టి ప్రతి ఓటరు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు.
నవీన్ యాదవ్ ప్రజల ఆశయాలను నేరవేరుస్తారని, జూబ్లీ హిల్స్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతాడని, సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రతి వర్గానికి న్యాయం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్



కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మంగ్లి రాములు, జిల్లా నాయకులు గుర్రం కేశవులు, కృష్ణ నాయక్, ఎంగలి ప్రసాద్, మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్ రెడ్డి, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కృష్ణ యాదవ్, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, రాజ్య నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.





## పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి

- తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలి
- తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని, పత్తిని వీలైనంత త్వరగా సేకరించి సురక్షిత ప్రాంతానికి తరలించేలా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. గురువారం ఆయన వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే పత్తిని తీసి తడవకుండా టార్పాలిన్లతో కప్పి ఉంచాలని తెలిపారు. తడిసిన పత్తిని చెట్లపై నుంచి తీయకుండా ఆరిపోయాక సేకరించాలని తెలిపారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12శాతం మించకుండా జాగ్రత్త పడాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా తుఫాను తగ్గిన తరువాత, తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. చేనులో నిల్వ ఉన్న నీటిని పిల్ల కాలువలు ఏర్పాటు చేసి బయటకు పంపేలా చూడాలని, పూర్తిగా పడిపోయిన కంకులను కట్టలుగా కట్టి నిలబెట్టడం ద్వారా ధాన్యం నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొలక రాకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల క్లస్టర్స్ భూదేవి, గాయత్రి, మీనాక్షి, నందు తదితరులు రైతులు ఉన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):**
"మొంథా" తుఫాను ప్రభావంతో ఈదురు గాలులకు, కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం తలకొండ పల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో రైతు కడమోని రవి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లోకి అధికారులను పంపించి నష్టపోయిన పంటల నివేదికలు తెప్పించుకొని రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా చూసుకుంటామన్నారు. తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి పంట నష్టం అందించలేదన్నారు. పంట నష్టం అంచనా వేసి ప్రతి ఎకరాకు నష్ట పరిహారం అందించేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి కాంగ్రెస్ నేతలు క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులతో కలిసి పంట నష్టం పై నివేదికలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం, నాయకులు శ్రీను, నర్సింహా, రాజు తదితరులు పాల్గొన్నారు.









## చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి త్వరలో ఇంటి నెంబర్లు

**మూడు వారాల్లో అందజేస్తామని హామీ ఇచ్చిన కమిషనర్ వెంకట్‌రెడ్డి**

**కీసర, అక్టోబర్ 30,(అక్షర గళం):**
మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల గ్రామ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మౌలిక వసతుల సమస్యలు అధికమై ఉండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో గత సంవత్సరాలుగా డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సదుపాయాలు అందుబాటు లో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు తెలిపారు. ఇంటి పట్టాలు అందించినా, ఇంటి నెంబర్‌లు ఇవ్వకపోవడంతో రాత్రి వేళల్లో అసౌకర్యాలు ఎదురవుతున్నాయి, చీకట్లో ప్రమాదాల భయంతో జీవిస్తున్నామని వారు విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డిని కలిసి తమ గోడును తెలియజేశారు. సమస్యలపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ లక్ష్యం ప్రతి కాలనీకి మౌలిక వసతులను కల్పించడం అని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉన్న లోపాలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇంటి నెంబర్‌లు లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన కమిషనర్, మూడువారాల్లో కాలనీలో అన్ని ఇండ్లకు నెంబర్‌లు కేటాయిస్తాం అని స్పష్టం చేశారు. తదుపరి డ్రైనేజీ, తాగునీరు, రహదారులు వంటి వసతుల మెరుగుదలపై కూడా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కమిషనర్ హామీతో కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు కొల బాల్ రాజ్ యాదవ్, నేతలు బోడ శ్రీనివాస్, మాజి వార్డు సభ్యులు రమేష్ గౌడ్, కాలనీ మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# సర్వైలెన్స్, సైబర్ క్రైమ్‌పై జాగ్రత్తగా ఉండాలి

### భాగ్యరథి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ నవీన్ రాజ్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 30, (అక్షర గళం):** సర్వైలెన్స్ , సైబర్ క్రైమ్‌పై జాగ్రత్తగా ఉండాలని భాగ్యరథి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ నవీన్ రాజ్ అన్నారు. గురువారం చింతల్ లోని భాగ్యరథి డిగ్రీ కాలేజీలో మహిళల భద్రత, రోడ్డు రక్షణ ,సైబర్ నేరాల నివారణ కోసం షీ టీం, బాలానగర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు , రోడ్డు భద్రతపై విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. మత్తు పదార్థాల వినియోగంమానుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌కి అవసరంలేని యాప్స్‌కి అనుమతులు ఇవ్వకూడదన్నారు. ఫోన్‌లో అన్ని సేఫ్టీ సెట్టింగ్స్ ఆన్ చేయాలి టీ షేప్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు.ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 చేసి, 8 నొక్కితే మొబైల్ ట్రాకింగ్ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి 2 నిమిషాలకు ఒకసారి భద్రతా అలర్టు వస్తాయన్నారు. బైక్ నడిపేవారు ,వెనుక కూర్చునే వారు ఇద్దరూ సరైన హెల్మెట్, నీ ప్యాడ్స్, గ్లోవ్స్ ధరించాలన్నారు. మహిళలపై వేధింపులపై సవరణ చేసిన చట్టం ప్రకారం శిక్ష 14 సంవత్సరాల నుంచి జీవిత ఖైదు లేదా మరణదండన వరకు విధించబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, షీ టీమ్ బాలానగర్ సభ్యులు ఎఎస్ఐ లాల్‌బహదూర్, హెడ్ కానిస్టేబుల్ జి.శివయ్య, రాజేష్,పోలీస్ కానిస్టేబుల్ సునీల్ కుమార్, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ సైనితిషాలు పాల్గొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం

### ములుగు జిల్లా డా. శబరీష్ పి

**ములుగు, అక్టోబర్ 30, (అక్షర గళం):** రక్తదానం ప్రాణదానంతో సమానమని ములుగు జిల్లా డా.శబరీష్ పి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా, ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి ఆదేశాల మేరకు గురువారం ములుగు డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ములుగు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి. హాజరై, శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను రక్షించడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పోలీస్ అమరవీరుల స్మరణోత్సవాల సందర్భంగా యువత, ప్రజలు, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది ఇలా సుమారు 500 మంది స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమని" అన్నారు.

విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగా లను సమాజం ఎప్పటికీ మరవదని, వారి స్మృతికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వ హిస్తామని పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 180 యూనిట్ల రక్తం సేకరించ బడింది.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివం ఉపాధ్యాయ, ఐపీఎస్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు దయాకర్, సురేష్, ఆర్ఐలు స్వామి, సంతోష్, వెంకటనారాయణ, ఎస్ఐలు, ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అనుష, ఆసుపత్రి సిబ్బంది, వరంగల్ మరియు ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి

**కుషాయిగూడ, అక్టోబర్ 30,(అక్షర గళం):** పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని ట్రాఫిక్



ఇన్స్పెక్టర్ ఎన్.రామ లక్ష్మణ రాజు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈసీఐఎల్ క్రాస్ రోడ్ నుండి తాళ్లూరి క్రాస్ రోడ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు 90 మంది కళాశాల విద్యార్థులు,యువత మరియు స్థానికులు పాల్గొన్నారు.తాళ్లూరి క్రాస్ రోడ్ వద్ద అమరవీరులకు ఒక నిమిషం మౌన నివాళి అర్పించారు.

అనంతరం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎన్.రామ లక్ష్మణ రాజు మాట్లాడుతూ... దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారాయన. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందేలా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ట్రాఫిక్ అవగాహన కీలకమని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమాన్ని ఎస్‌హెచ్ఓ ఎన్.రామ లక్ష్మణ రాజు, ఎస్ఐలు జి.మధు,లింగారెడ్డి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన కర్నె చిట్టిబాబు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనో ధైర్యం కల్పించారు. అదేవిధంగా 50 కిలోల రైస్ బ్యాగును అందజేశారు. ఎల్లవేళలా కుటుంబానికి ఎలాంటి అపద వచ్చిన ముందుండి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కర్నె యాదయ్య, కర్నె జప్పయ్య, కర్నె రాజు, జంతుక అశోక్, మాలేపాకుల జగదీశ్, వస్పుల శేఖర్ తదితరులు ఉన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి

**కీసర,అక్టోబర్ 30,(అక్షర గళం):** నాగారం మున్సిపల్ పరిధిలో అభివఅద్ధి పనులకు,మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాగారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గురువారం నాగారం పురపాలక సంఘం పరిధిలోని చండీశ్వర్ నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నాగారం



పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,మాజి కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కందాడి శ్రీనివాస్ రెడ్డి,విశ్వనాథ్ యాదవ్, బద్రు నాయక్,రాజు యాదవ్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్‌కు నగదు రివార్డు అందజేసిన సీఐ

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):** విధుల్లో చాకచక్యంగా వ్యవహరిస్తూ ఉన్నత అధికారులచే ఉత్తమ అవార్డు అందుకున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ కే.దశరథ్ కు సీఐ బద్యానాద్ చౌహాన్ నగదు రివార్డు అందజేశారు. ఈమేరకు గురువారం ఆమనగల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన




మాట్లాడుతూ.. 2022 జనవరి నెలలో తెలంగాణ కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టు నుంచి బదిలీపై వచ్చిన దశరథ్ అంకిత భావంతో విధులు నిర్వహిస్తు బెస్ట్ ఎంప్లాయి గా ఎంపికై ఆగష్టు 15న జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 27 వాహనాలను అదుపులోకి తీసుకోవడంతో పాటు నల్ల బెల్లం, నాటు సారా నియంత్రణకు విశేష కృషి చేస్తున్న దశరథ్ ను అభినందిస్తూ తన తరపున రూ.5 వేలు నగదు పురస్కారం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల బ్రతుకులకు భరోసానిచ్చిన పార్టీ బిఆర్ఎస్

**జూబ్లీహిల్స్, అక్టోబర్ 30, (అక్షర గళం):** పేద ప్రజల బ్రతుకులకు భరోసానిచ్చిన పార్టీ బిఆర్ఎస్ అయితే, అబద్ధపు హామీలతో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక ప్రజలకు మొండి "చెయ్యి" చూపిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప




ఎన్నికలను పురస్కరించుకొని గురువారం103 – బోరబండ డివిజన్ బాబా సైలానీ నగర్ లో బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్, మాగంటి సునీత గోపీనాథ్ కి మద్దతుగా వారి కుమార్తెలు దీక్షిత, అక్షిత లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో మన బ్రతుకులకు భరోసా నిచ్చిన బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ 3వ నెంబర్ పై ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

# ఓయూ డిగ్రీ పరీక్షల తేదీల ఖరారు

**హైదరాబాద్,అక్టోబర్ 30(అక్షరగళం):** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీబీఏ, బీబీఏ అనాలిటిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ లిలిలి.నీబపజీనితిజీ.జీఇ.తినిలో చూసుకోవచ్చని సూచించారు.



# ఎన్ఎస్ఈయుఐ విస్తృత ప్రచారం

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం ఎన్ఎస్ఈయుఐ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. గురువారం యూసుఫ్‌గూడాలోని పలు కాలనీలలో ఎన్ఎస్ ఈయుఐ నాయకులతో రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ కు ఓటు వేసి అభివృద్ధిని మరింత పటిష్టం చేయాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. నవీన్ యాదవ్ సేవా దృక్పథంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద ఉన్నా అన్ని వేళలా ఆదుకుంటూ ఉంటున్న వ్యక్తిగా గుర్తింపు పొందారని, కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఫరీద్ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్తీక్, రమేష్, విష్ణు, రోహిత్, అజాజ్, ఫైజాన్ తదితరులు ఉన్నారు.



# నవంబర్ 1న దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ విజయవంతం చేయాలి

### - ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):** న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 1న ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగబోయే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతూ.. భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్‌గవాయిపై దాడికి పాల్పడిన మతోన్మాద న్యాయవాదిని అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు, స్వతంత్ర భారతదేశంలో సీజేఐ పైన జరిగిన దాడిని దేశంలోని దళితుల మీద దాడిగానే భావిస్తున్నామని, దళితులు అత్యున్నత స్థానంలో ఉంటే ఓర్వలేని శక్తులు దేశంలో ఎక్కువవుతున్నాయని వాటిని ఖండించడానికి, ఇకపైన ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో శ్రీరాములు, రాకేష్, భీముడు, శాంసన్, వంశీ, రాహుల్ తదితరులు ఉన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలంతా తమ మద్దతు తెలియజేస్తున్నారు

**జూబ్లీహిల్స్,అక్టోబర్ 30,(అక్షరగళం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలందరూ పెద్ద ఎత్తున తమ మద్దతు తెలియజేస్తున్నారని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తుందని మహిళలు యువకుల మద్దతు కాంగ్రెస్‌కి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ లను అమలు చేస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా రమేష్ గురువారం వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలి పించాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ పాలనపై ధ్వజమెత్తారు ఆ పార్టీ నాయకులు రాష్ట్రాన్ని కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు దోచుకు తిన్నారని విమర్శించారు ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నారన్నారు. ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు.



# భారీ వర్షం.. అతలాకుతలం

**ఆమనగల్లు, అక్టోబర్ 30 (అక్షర గళం):** మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని ముర్తుజ పల్లి గ్రామానికి చెందిన రైతు మెండే రాములు చేతికందిన 2 ఎకరాల వరి పంటలు పూర్తిగా నేలవాలాయి.

అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా నీటమునిగాయి.

పత్తి తీసే సమయంలో తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షం రైతులను తీవ్ర నష్టాల్లోని నెట్టింది. వరి పంట కోతకు రాగా ఈదురు గాలులు కారణంగా నెలవాలింది.

## విమానంలో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

హైదరాబాద్,అక్టోబర్ 30(అక్షరగళం): జెద్దా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. జెద్దా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా ఛాతీలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పారు. వారు అతనికి సీపీఆర్ చేశారు. ఉదయం 9.27 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయిన వెంటనే ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఖాసీంను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో అంబర్‌పేటలోని స్వగృహానికి తరలించారు.

## టీజీ సెట్ - 2025 దరఖాస్తు గడువును పొడగింపు

హైదరాబాద్,అక్టోబర్ 30(అక్షరగళం): తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్ - 2025 దరఖాస్తు స్వీకరణ గడువును పొడగించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా వచ్చే నెల 6వ తేదీలోగా ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రూ.1500 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు, రూ.3000 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. డిసెంబర్ నెల రెండో వారంలో పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 0040-27097733, 8331040950 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట

### అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు

న్యూఢిల్లీ,అక్టోబర్ 30(అక్షరగళం): ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉంటుందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్‌దే కీలక పాత్ర.



ఇప్పటికే న్యూఢిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజఖిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడినుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్-ఇరాన్ (ఎనిటతిజీ-ఎసజీని)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు చేసింది. ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే.. వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఆ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కౌంటర్ ఇచ్చారు.

## ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

### రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి

హైదరాబాద్,అక్టోబర్ 30(అక్షరగళం): ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷-దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

## మొథా తుఫాన్‌తో రోడ్లకు దెబ్బ

### 334 లోకేషన్స్‌లో 230 కి.మీ ధ్వంసం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 30(అక్షరగళం): మొంథా తుఫాను ప్రభావంతో తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. తాజాగా తుఫాన్ ఎఫెక్ట్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి మాట్లాడారు. నిన్న అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు, కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి, పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. వరి ధాన్యం సుమారు 2లక్షల మెట్రిక్ టన్నులు ఐకేపీ సెంటర్లో ఉంది. మన ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం.. తడిసిన ధాన్యాన్ని కూడా కొని వెంటనే మిల్లులకు తరలించేలా ముఖ్యమంత్రి, సివిల్ సప్లై మినిస్టర్ చొరవ చూపాలి. సేకరించిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా.. మిల్లర్లు వెంటనే ఆ ధాన్యాన్ని తీసుకునేలా చూడండి.. పత్తి తేమ శాతానికి సంబంధించి ఇప్పటికే సీసీఐ ఛైర్మన్ లలిత్ కుమార్ గుప్తాను ముంబై వెళ్లి మరి కలిసి రైతుల పక్షాన ప్రత్యేక విజ్ఞప్తి చేశాను.. తేమ శాతంలో సడలింపులు ఇచ్చి తెలంగాణ పత్తి రైతులను ఆదుకోవాలని కోరాను. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి కి రిక్వెస్ట్ చేస్తున్నాం.' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## హన్మకొండలో వరదబాధితుల ఆందోళన

### మేయర్, కమిషనర్ల వాహనాలు అడ్డగింత

హనుమకొండ,అక్టోబర్ 30(అక్షరగళం): హన్మకొండసమ్మయ్యనగర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ చాహత్ , మేయర్ సుధారాణి వాహనాలను వరద బాధితులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తులసి బార్ దగ్గర గేట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పూర్ చెరువు మత్తడి వద్ద గేట్లు మూసివేయడంతోనే గండిపడి వరద తీవ్రత పెరిగిందని సమ్మయ్య నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఈ పరిస్థితులు ఉండేవి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, హనుమకొండలో వరద ఉద్రిక్తత ఏర్పడింది. మొంథా తుఫాన్ కారణంగా పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ళలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ సైతం హనుమకొండ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

### బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు



కూకట్‌పల్లి, అక్టోబర్ 30, (అక్షర గళం): రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి గెలుపే లక్ష్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్ 327 అధ్యక్షులు సునీల్ చేపట్టిన ప్రచారానికి భారతీయ జనతా పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులతో కలిసి ఇంటి ఇంటికి, గడప గడపకు తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓటర్లను మంచి స్పందన వస్తుందని, ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు బిజెపికే నంటూ, గెలుపు బిజెపిదే నంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయక కాలయాపన చేస్తుందన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ గురించి తెలంగాణ ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని ఎద్దేవా చేశారు, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలతో కాంగ్రెస్ పార్టీ చీకటి ఒప్పందం చేసుకుందని.. బీఆర్ఎస్ కుంభకోణాల మీద విచారణ ఎంత వరకు వచ్చిందో కాంగ్రెస్ పార్టీ ఎందుకు స్పష్టం చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణాలో లా & ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బ తినే విధంగా హిందూ ఆలయాలను ధ్వంసం చేయడం, గతంలో ఎన్నడూ లేని విధంగా నడిరోడ్డుపై పోలీసులనే కత్తులతో, తుపాకులతో హతమారుస్తుండం శోచనీయమన్నారు. రాష్ట్రానికి హోమ్ మంత్రిని నియమించలేని దీన స్థితిలో రేవంత్ రెడ్డి పాలన ఉందని ఎద్దేవా చేశారు, ప్రధాని మోదీ సమర్థ పాలన తెలంగాణలో రావాలి అంటే దానికి జూబ్లీ హిల్స్ లో బిజెపి గెలుపే నాంది పలకాలని, సురక్షితమైన - సుభిక్షమైన జూబ్లీ హిల్స్ కోసం కమలం పువ్వు గుర్తు కి ఓటు వేసి, బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించవలసిందిగా ఓటరు మహాశయులను ఈ సందర్భంగా కాంతారావు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బిజెపి శ్రేణులు వినోద్ కుమార్ గౌడ్, దేశభక్తుల సుధరవి, పోలింగ్ బూత్ అధ్యక్షులు సునీల్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.





# బైరాపూర్ వాగును పరిశీలించిన ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, అక్టోబర్ 30 (అక్షర గళం): వెల్దండ మండల పరిధిలోని బైరాపూర్ వాగు మొంథా తుఫాను ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షా లకు బైరాపూర్ ఉధృతంగా ప్రవహిస్తున్న బైరాపూర్ నుండి వెల్దండ విద్యార్థులు స్కూలుకు కాలేజీకి వెళ్లడానికి చాలా ఇబ్బంది అవుతుందని వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నతో రాక పోకలు నిలిచిపోయాయి. వాగును ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ కమిటీ సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్ పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి వరి పంట పొలాలను ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి తెలం గాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ కమిటీ సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్ పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లోకి అధికారులను పంపించి నష్టపోయిన పంటల నివేదికలు తెప్పించుకొని రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి కాంగ్రెస్ నేతలు క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులతో కలిసి పంట నష్టం పై నివేదికలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో వెల్దండ తహసిల్దార్ కార్తీక్ కుమార్ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్





నూతన బ్రిడ్జిని అధికారులతో మాట్లాడి వెంటనే బ్రిడ్జిని త్వరలోనే నూతన బ్రిడ్జిని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు అదేవిధంగా ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న చూసుకుంటామన్నారు. తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి పంట నష్టం అందించలేదన్నారు. పంట నష్టం అంచనా వేసి ప్రతి ఎకరాకు నష్ట పరిహారం అందించేలా కొయ్యల పుల్లయ్య ఎర్ర శ్రీను ఎండి రషీద్ అలీ భాయ్ గుద్దేటి కిష్టాల్ ముదిగొండ రమేష్ రాజు మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మోకాలి లోతు బురదలో దిగి..

# నేలకొరిగిన పంటను పరిశీలించి...

- నష్టపోయిన రైతుల్లో భరోసా నింపిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- నేలకొరిగిన పంట పొలాల పరిశీలన... తుపాను ప్రభావంపై ఆరా
- మానవతా దృక్పథంతో తుపాను నష్టం అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచన

మోకాలు లోతు బురదలో దిగారు. అన్నదాత కష్టాన్ని విని ఓదార్చారు. తుపాను కారణంగా జరిగిన పంట నష్టాన్ని పంట పొలాల మధ్యకు వెళ్లి పరిశీలించారు. అరటి రైతుల ఆవేదన విన్నారు. మీ కష్టంలో మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సాగిన తీరిది.

ఉదయం 11 గంటల ప్రాంతంలో అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ నేరుగా కోడూరు మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో నేలకొరిగిన వరి చేల వద్దకు వెళ్లారు. రైతులతో కలసి బురద చేలోకి దిగి పడిపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొట్ట దశలో ఉన్న వరి కంకులను పరిశీలిం చారు. అన్ని విధాలా ఆదుకుంటామంటూ కూటమి ప్రభుత్వం తరపున భరోసా ఇచ్చారు.

### పొట్ట దశలో పుట్టి ముంచింది

కృష్ణాపురం గ్రామానికి చెందిన కోట రమేష్ అనే రైతుకి చెందిన అయిదు ఎకరాల వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా ఆ రైతు తనకు వచ్చిన కష్టాన్ని ఆయనకు వివరించారు. ఇప్పుడిప్పుడే వరి పొట్ట పాలు పోసుకుంటున్న దశలో తుపాను రావడం వల్ల పంట పూర్తిగా నాశనం అయిందని, ఎందుకూ పనికి రాకుండా పోయిందని పవన్ కళ్యాణ్ ఎదుట వాపోయారు. మరో రెండు వారాలు ఆగితే పంట కోత దశకు వచ్చేదని తెలిపారు. వెంకటేశ్వరరావు, గోవాడ నాగేశ్వరరావు అనే రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు.

నీటిలో తడిసిన ధాన్యపు గింజలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కు త్వరితగతిన పంట నష్టం నివేదికలు ఇవ్వాలని సూచించారు. నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా ఉన్నారని, వారిని ఆదుకోవా లని పలువురు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. తుపాను కారణంగా నష్టపోయిన కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

### నేలకొరిగిన అరటి తోట పరిశీలన

అవనిగడ్డ మండల పరిధిలోని రామచంద్రపురం సమీపంలో తుపాను ధాటికి దెబ్బతిన్న అరటి తోటను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. శ్రీ విష్ణుమూర్తి అనే రైతుకి చెందిన అరటి తోట మొంథా తుపాను సమయంలో వీచిన పెనుగాలులకు పూర్తిగా నేల మట్టం అయినట్లు తెలుసుకున్నారు. సుమారు 1400 అరటి గెలలు పనికిరాకుండా పోయాయని రైతు పవన్ కళ్యాణ్ కి వివరించారు. ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసే



సమయంలో రైతులకి మేలు చేసేలా ఆలోచన చేయాలని సూచించారు. దెబ్బ తిన్న అరట తోటలో ఎంత మేర పనికొస్తుంది? తిరిగి తోట బతుకుతుందా లేదా? మొత్తం తీసి తిరిగి పంట వేసుకోవడానికి ఎంత ఖర్చు అవుతుంది? అనే వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలని తెలిపారు.

### మానవతా దృక్పథంతో పంట నష్టం నివేదికలు రూపొందించండి

పంట నష్టంపై గణన చేపట్టే సమయంలో వ్యవసాయ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, రైతుల పక్షాన నివేదికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. జరిగిన నష్టానికి పక్కాగా అంచనా వేసి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌలు రైతులకు కూడా న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

### నూతన అవుట్ ఫాల్ స్లూయిజ్ నిర్మాణంపై చర్చ

ఈ సందర్భంగా కోడూరు, అవనిగడ్డ మండలాల్లో సముద్రపు పోటుకు తీర ప్రాంత గ్రామాల్లో పంట నష్టం వాటిల్లుతోన్న విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్‌తీసుకువచ్చారు. సముద్రం కరకట్టపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన అవుట్ ఫాల్ స్లూయిజ్ లు దెబ్బతినడం కారణంగా పోటు సమయంలో సముద్రపు నీరు పంట పొలాల్లోకి చొచ్చుకు వస్తోందని తెలిపారు. నూతన స్లూయిజ్ ల నిర్మాణం చేపడితే 5 వేల ఎకరాల్లో పంటలను కాపాడవచ్చని చెప్పారు. ఈ సమస్యపై సమగ్ర నివేదిక రూపొందించి సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తానని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ప్రజలతో మమేకం.. తుపాను ప్రభావంపై ఆరా

పవన్ కళ్యాణ్ పర్యటన ఆద్యంతం ప్రజలతో మమేకమయ్యారు. రైతుల పరామర్శ అనంతరం తిరుగు ప్రయాణంలో కోడూరు, అవనిగడ్డ మధ్య విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, మాచవరం తదితర గ్రామాల్లో రోడ్లపై బారులు తీరిన ప్రజల మధ్యకు వెళ్లి వారి సమ స్యలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో తుపాను ప్రభావం ఎలా ఉందనిఅడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేం దుకు, పవన్ కళ్యాణ్‌తో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

పులిగడ్డ సమీపంలో రోడ్ సైడ్ కూరగాయలు, కొబ్బరి బొండాలు విక్రయించే వ్యాపారులను పవన్ కళ్యాణ్ పలకరించారు. అక్కడ ఉన్న ప్రజలను కలుసుకున్నారు. తుపాను ప్రభావం వల్ల ఎమైనా నష్టం వాటిల్లిందా అన్న విషయంపై ఆరా తీశారు. కుటుంబ పరిస్థి తులు అడిగి తెలుసుకున్నారు. గొర్రె నాగసూరి అనే మహిళ ఇల్లు కావాలని పవన్ కళ్యాణ్ ని కోరారు. పెద్ది వెంకటేశ్వరరావు అనే వృద్ధుడికి చెందిన దెబ్బతిన్న ఇంటిని పరిశీలించి, ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బొర్రా రాము అనే ఆటో డ్రైవర్ ను పలకరించి జీవనోపాధి ఎలా సాగుతుంది అని అడిగి తెలుసుకున్నారు.

మచిలీపట్నం పోర్టుకి అనుసంధానంగా జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతామన్న భయంతో పలువురు రైతులు పవన్ కళ్యాణ్‌కి తమ సమస్యను విన్నవించుకున్నారు. గతంలో 65వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణంలోనూ భూములు కోల్పోయామని, ఇప్పుడు మరోసారి విలువైన భూములు కోల్పోతామన్న భయం పట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని విస్తరించకుండా, నేరుగా పోర్టు రోడ్డుకి కలిపేలా సమాంతరంగా మరో రహదారిని నిర్మించాలన్న తమ సూచనను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి సమస్యలు వింటూ, ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సూచనలు చేస్తూ పవన్ కళ్యాణ్ ముందుకు సాగారు.

# సంపాదకీయం..

## సహాయ,పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి!

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజోన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని



ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20–30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా–చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం–హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది.

వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్దరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్తాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్దరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్దప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.

## మళ్లీ ప్రజల్లోకి విజయ్

కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి



తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు.

బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీతో పొత్తు లేనట్లేనని సూచన ప్రాయంగా నిర్మల్‌కుమార్ తెలియజేశారు.

# సమిష్టి కృషి, టెక్నాలజీ సాయంతో తుపాను నష్టం తగ్గించాం

మొంథా తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సీసీ కెమెరాల లాంటి సాంకేతికత వినియోగించి ఈ ప్రాథమిక నష్ట అంచనాలను రూపొందించామని వెల్లడించారు. మొంథా తుపాను ప్రభావంతో కలిగిన నష్టాన్ని కూడా టెక్నాలజీ సాయంతోనే తగ్గించినట్టు సీఎం స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఎం.. రాష్ట్రంపై తుపాను ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణ అంశాలపై విలేఖరులకు వివరించారు. వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, ఆర్అండ్ బీకి రూ.2,079 కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.109 కోట్లు, జలవనరుల విభాగంలో రూ.207 కోట్లు, పంచాయితీరాజ్ రూ.8 కోట్లు, విద్యుత్ శాఖ రూ.16 కోట్లు పశు సంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు.

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ”సాంకేతిక పరిజ్ఞానంతో తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. అత్యంత ఖచ్చితత్వంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికల్ని చేరవేయగలిగాం. టెక్నాలజీ సాయంతో తుఫాన్ ప్రభావం వల్ల కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించకలిగాం. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయి.

మొదటి రోజునే పరిస్థితులను చాలా వరకూ చక్కదిద్దాం. ఎప్పటికప్పుడు తుఫాన్ ప్రభావంపై సమీక్షలు నిర్వహించాం. అంతర్వేదికి సమీపంలో తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. శాటిలైట్ ఇమేజ్ ల ఆధారంగా తుఫాన్ పరిస్థితిని అంచనా వేశాం. సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలతో ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన నష్టాన్ని బాగా తగ్గించాం. వర్షాలు, గాలుల తీవ్రతను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి చర్యలు తీసుకున్నాం.

గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో టెక్నాలజీ ద్వారా నష్టాలను తగ్గించాం. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రవాహాలు పెద్ద ఎత్తున వస్తాయనేది అంచనా వేసి ముందస్తుగా హెచ్చరికలు ఇచ్చాం.” అని ముఖ్యమంత్రి అన్నారు.

### ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ఓ మాన్యువల్



“మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకూ, లైన్ డిపార్టుమెంట్ల నుంచి గ్రామ వార్డు సచివాలయం వరకూ ఉద్యోగులు, సిబ్బంది తుపాను నష్టాల తీవ్రతను తగ్గించటంలో కృషి చేశారు. ఆర్టీజీఎస్ నుంచి మంత్రులు లోకేష్, అనితలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయికి ఆదేశాలు జారీ చేశారు. అంతా కలిసి సమష్టిగా పని చేయబట్టే ఇది సాధ్యమైంది. వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను.

గతంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా.. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. రియల్ టైమ్‌లోనే డేటా లేక్ ద్వారా సమాచారం విశ్లేషించి త్వరగా నిర్ణయాలు తీసుకోగలిగాం. టెక్నాలజీ వినియోగించి పంట నష్టాలు, ముంపు ప్రాంతాలు తదితర అంశాలను కూడా గుర్తించాం. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ మనుషులు.. ఫేక్ పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉంది.

తుపాను కారణంగా నెల్లూరు నుంచి విశాఖ వరకూ భారీ వర్షాలు కురిసినా రాయలసీమలో కొన్ని చోట్ల వర్షాలు పడలేదు. వర్షాభావంతో కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 37 కరవు మండలాలుగా ప్రకటిస్తున్నాం. ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కునేందుకు మొంథా తుపాను అనుభవాన్ని ఓ మాన్యువల్ గా రూపొందిస్తాం. టెక్నాలజీ వినియోగం ప్రజా ప్రయోజనాల కోసమే” అని ముఖ్యమంత్రి అన్నారు.

# మొంథా తుఫాన్.. పర్ఫెక్ట్ హ్యాండ్లింగ్

మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ. మొంథా తుఫాను విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం అమలు చేసిన పంచసూత్ర ప్రణాళిక ఇదే. తుఫాన్ హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి నిరంతరం మానిటర్ చేసుకోవడం... ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని.. ప్రజలను అలెర్ట్ చేయడం, నీట మునిగిన ప్రాంతాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి పునరావాసం కల్పించడం.. తుఫాన్ తగ్గాక.. సాధారణ పరిస్థితులు తీసుకురావడం.

మొంథా తుఫాన్ సమయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని బృందం ఈ అంశాలపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. దీనికి పూర్తి స్థాయి టెక్నాలజీని జోడించడం, క్షేత్రస్థాయిలో మంత్రులు, అధికారులు, ఉద్యోగులతో కూడిన బృందాలతో సమర్ధవంతంగా పని చేయించడంతో మొంథా తుఫాను వల్ల కలిగే నష్టాన్ని చాలా వరకు నివారించగలిగింది. ప్రకృతి విపత్తును నివారించే అవకాశం లేదు కాబట్టి...నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలనే లక్ష్యంతో టీం ఆంధ్రప్రదేశ్ పని చేసింది.

ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించుకునే దిశగా ఐదు రోజుల పాటు రాత్రి–పగలు తేడా లేకుండా అధికార యంత్రాంగం పనిచేసింది. ఇదే ఇప్పుడు సత్ఫలితాలను ఇచ్చింది. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రం మీద ఎక్కువగా ఉంటుందనే వాతావరణ హెచ్చరిక రాగానే సీఎం చంద్రబాబు అలెర్ట్ అయ్యారు. తుఫాన్ కదలికలను నిరంతరం మానిటర్ చేసుకోవడం... ఏయే ప్రాంతాల్లో ఎక్కువ తుఫాన్ ప్రభావం ఉండొచ్చనే విషయాలపై మానిటరింగ్ చేసుకోవడం... ఆ దిశగా క్షేత్ర స్థాయిలో ఉన్న వారిని అలెర్ట్ చేస్తూ... మొంథా తుఫాన్ తీరాన్ని తాకినా... ప్రజల జీవితాలను తాకకుండా అన్ని రకాల జాగ్రత్తలు ప్రభుత్వం తీసుకుంది .

కొద్దిపాటి ప్రభావం ఉంటుందనుకున్న ప్రాంతాల్లోని వారిని కూడా పునరావాస శిబిరాలకు తరలించారు. లక్ష మందికి పైగా ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్షేత్ర స్థాయి నుంచి రియల్ టైంలో సమాచారాన్ని తీసుకోవడం.. దాన్ని విశ్లేషించడం... వాటిని ఆయా విభాగాల బాధ్యులకు చేరవేసి.. సమస్యను పరిష్కరించేలా చూడడం వంటి ప్రక్రియను సీఎం చంద్రబాబు నేతృత్వంలో బృందం సమర్ధవంతంగా అమలు చేసింది. ఇక సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటించి... బాధితులకు భరోసా ఇచ్చారు.

### అనుభవానికి టెక్నాలజీ తోడు

ఇక ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేలా ప్రభుత్వం ఈ విపత్తు కాలంలో పని చేసింది. శిశువుల నుంచి వృద్ధుల వరకు.. అలాగే గర్భిణులను కూడా సంరక్షణ కేంద్రానికి తరలించింది. పశువుల ప్రాణాలను కూడా కాపాడేందుకు యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సమాయత్తం చేశారు. దీనికి టెక్నాలజీని జోడించారు. దీంట్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు వరుసగా 1.1 కోట్ల సందేశాలు పంపారు. అలాగే సాంకేతికతను జోడించి గ్రామాల్లో మైక్ ద్వారా ఎనౌన్సుమెంట్ చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు.

ఆర్టీజీ సెంటర్ నుంచే సెల్ ఫోన్ ద్వారా ఆ మైక్ ఎనౌన్సుమెంటును ఆపరేట్ విధానాన్ని రూపొందించడమే కాకుండా.. ఒకవేళ సెల్ ఫోన్ సిగ్నల్ లేకపోతే శాటిలైట్ ద్వారా ఆ వ్యవస్థ పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యల వల్ల గతంతో పోల్చితే ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస శిబిరాలకు తీసుకురావడం సులువైంది. సహజంగా లంక గ్రామాల ప్రజలు తమ ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడరు.

తుఫాన్లు వచ్చినా...ఇళ్ల పైకప్పులపైకి ఎక్కుతారు. కానీ ప్రభుత్వం ముందుగానే అలెర్ట్ చేయడంతోపాటు... క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి వారికి నచ్చచెప్పి తుఫాన్ షెల్టర్లకు తీసుకొచ్చింది. దీంతో ప్రాణ నష్టానికి స్థానం లేకుండా చేయగలగింది. ఇక టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మరోసారి రుజువైంది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని డ్రోన్ల ద్వారా గుర్తించి పోలీసులు, అధికారుల బృందం అతణ్ని రక్షించింది.

ప్రభుత్వం వద్ద ఉన్న అలెర్ట్ మెకానిజం ద్వారా త్వరగా రెస్పాండ్ కావడం వల్లే బాపట్ల జిల్లాలోనే ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లి చిక్కుకుపోయిన 15 మందిని రెస్క్యూ ఆపరేషన్ చేసి కాపాడారు. ఈ విషయంలో ఏ మాత్రం అలక్ష్యం వహించినా.. వారి ప్రాణాలు దక్కేవి కాదు. ఇక గర్భిణులు, దివ్యాంగుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. టెక్నాలజీతో పాటు...ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా హ్యాండిల్ చేయాలనే అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న అనుభవం బాగా కలిసి వచ్చింది.

### లైవ్ ట్రాకింగ్, రియల్ టైం సొల్యూషన్స్

ఇక పంటలకు నష్టం వాటిల్లకుండా కూడా ప్రభుత్వం వీలైనంత మేరకు జాగ్రత్తలు తీసుకుంది. తుఫాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించే అంశాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా చేయడం ద్వారా వీలైనంత మేర పంట నష్టం తగ్గించే ప్రయత్నం చేసింది ప్రభుత్వం.

ఇక డ్రైన్లు కూడా క్లీనప్ చేయడంతో... నగరాల్లో కూడా నీటినిల్వ లేకుండా చూడడంలో అధికార యంత్రాంగం సక్సెస్ అయింది. ఇక తుఫాన్ గాలులకు చెట్లు పడిపోయినా.. విద్యుత్ స్థంభాలు పడిపోయినా, వైర్లు తెగిపడినా వాటి కారణంగా ట్రాఫిక్ జాం కాకుండా, ప్రమాదాలు జరగకుండా.. వెంటనే వాటిని తొలగించడంతోపాటు.. విద్యుత్ వ్యవస్థను అతి తక్కువ సమయంలోనే పునరుద్దరించారు. దీనికోసం అవసరమైన సామాగ్రి, వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. వేలకొద్ది యంత్రాలను.. వాహనాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకున్నారు. ఇక సహాయక చర్యల నిమిత్తం జేసీబీలను కూడా భారీ ఎత్తున సిద్దం చేసుకుంది.

వాటికి లైవ్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన మేరకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. గతంలో వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా.. బోట్లు కొట్టుకురావడం.. బ్యారేజీల గేట్లకు బలంగా తాకడం వంటివి జరిగేవి. కానీ ఈసారి అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

దీంట్లో భాగంగానే... నెల్లూరు జిల్లా కలెక్టర్ తనకు అందిన సమాచారంతో అలెర్ట్ కావడంతో భారీ బోటును చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లేకుంటే సంగం బ్యారేజీకి ఆ బోట్లు ఢీ కొట్టి..ప్రమాదం ఏర్పడేది. ఇవన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవడం, అలెర్ట్ మెకానిజం ఉండడం వల్ల తప్పిన ప్రమాదాలే. ఇక కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు...

గండ్లు పడితే వాటిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు అవసరమైన ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. అలాగే రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీ సెంటర్ ద్వారా వచ్చిన ఆదేశాలు గ్రామ సచివాలయ స్థాయిలో వెంటనే అమలు చేయగలిగేలా విజయవంతంగా ప్రభుత్వం పని చేసింది.

### త్వరితగతిన నష్టపరిహారం అందచేయడం... నష్టం అంచనాల రూపొందించడం

ఇక పునరావాస శిబిరాలను ముందుగానే సిద్ధం చేశారు. ఎప్పుడు అవసరమైతే.. అప్పుడు సహాయ శిబిరాలను హడావుడిగా ఏర్పాటు చేసుకునే పరిస్థితికి స్వస్తి చెప్పాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి పునరావాస శిబిరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పడమే కాకుండా.. వాటిని అమల్లో పెట్టేలా చేశారు సీఎం. బాధితులకు ఆహారం, వసతి కల్పించడంతోపాటు.. కావాల్సిన మందులను కూడా పునరావాసంలో అందుబాటులో ఉంచారు.

ఇలాంటి ఏర్పాట్లను సిద్దం చేయడంతోపాటు.. పునరావాస కేంద్రాల్లోని పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే వైద్య బృందాలను సిద్ధం చేశారు. బాధితులకు అందించే నిత్యావసర వస్తువులను.. ఆర్థిక సాయాన్ని కూడా ముందుగానే ప్రభుత్వం సిద్ధం చేసుకుంది. ఇక పునరావాస శిబిరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... తుఫాన్ వెలిశాక.. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇక పంటనష్టం అంచనాలను కూడా త్వరితగతిన వేసి..కేంద్రానికి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించే వరకు పూర్తి స్థాయిలో ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం వ్యవహరించింది.



### వరదప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కందుల పర్యటన

రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పలుమార్లు పర్యటనలు చేసి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరఫునుండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు సైతం అధికారులతో సమన్వయం చేసుకొని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవాలని పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశర చేశారు. ప్రాథమిక అంచనాలో సుమారు 98 హెక్టార్ల అరటి తోటలు, 1800 హెక్టార్ల వరి పంట నేలకొరిగినట్లుఉద్యాన అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఉండ్రాజవరం, దమ్మెన్ను, పసలపూడి, కే సావరం, మోర్త, కాల్దారి తదితర గ్రామాలలో నివాసయోగ్యం కాని గృహాలలో నివసిస్తున్న 50 కుటుంబాలు, 170 మందికి, పునరావాసం కల్పించామన్నారు. వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సత్యవాడ, తదితర గ్రామాలలో మూడు రోజులపాటు మాంసం విక్రయాలు నిలిపి వేయాలని గ్రామంలో అవగాహన కల్పించినట్లు కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. తుఫాను ప్రభావాన్ని తట్టుకొని,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా, మండల విద్యుత్ శాఖ, కరెంటు తీగలపై చెట్టుకొమ్మలు పడకుండా నరికివేత, విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎలక్ట్రికల్ అధికారులు చెప్పారు. అప్పటివరకు వస్తూ, పోతూ ఉన్న విద్యుత్ సరఫరా భారీ గాలులతో సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు నెట్ సంబంధం తెగిపోయింది, ఇన్వెర్టర్లు మూగబోయాయి, అంధకారంలో, దోమల తో ప్రజలు ఇక్కట్లు పడాలి.





## బ్రేకులేసిన చరణి..

ఓపెనర్ లిచ్‌ఫీల్డ్, పెర్రీ రెండో వికెట్‌కు 155 పరుగుల దూకుడైన భాగస్వామ్యంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది. ఒకదశలో స్కోరు 400 మార్క్ దాటేలా కనిపించింది. కానీ, చివరి 16.1 ఓవర్లలో 118 పరుగులకు 8 వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు ఆసీస్ జోరుకు కొంతమేర బ్రేకులు వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ స్వల్ప స్కోరుకే కెప్టెన్ హీలీ (5) వికెట్ కోల్పోయింది. కానీ, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. లిచ్‌ఫీల్డ్, పెర్రీ క్రీజులో నిలదొక్కుకోవడంతో పరుగుల వరద పారింది. ముఖ్యంగా లిచ్‌ఫీల్డ్ గతితప్పిన భారత బౌలింగ్‌ను ఉతికి ఆరేసింది.

ఫీల్డింగ్ కూడా పేలవంగా ఉండడంతో ఫోబి స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. ఆమెను నియంత్రించడానికి హర్మన్‌ప్రీత్ బౌలర్లను మార్చి ప్రయోగించిన ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో శతకం పూర్తి చేసుకొన్న లిచ్‌ఫీల్డ్‌ను అమన్‌జోత్ బౌల్డ్ చేసి జట్టుకు ఊరటనిచ్చింది. ఆ తర్వాత బెత్ మూనీ (24), సదర్లాండ్ (3)ను చరణి అవుట్ చేయడంతో స్కోరు వేగం మందగించింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న పెర్రీని రాధ బౌల్డ్ చేసింది. కానీ, డెత్ ఓవర్లలో గార్డ్‌నర్ ఎడాపెడా షాట్లతో చెలరేగడంతో ఆసీస్ 330కి పైగా స్కోరు సాధించింది.

# భారత్ అదరహో..

### కదంతొక్కిన జెమీమా, హర్మన్

### సెమీస్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయం

### ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా నవీ

**ముంబై:** మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీ ఫైనల్లో భారత్ ఐదు వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఆదివారం జరిగే తుది పోరులో సౌతాఫ్రికాతో టీమిండియా తలపడుతోంది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీస్‌లో భారత్ చిరస్మరణీయ ఆటతో ఆకట్టుకుంది. ఆస్ట్రేలియా ఉంచిన క్లిష్టమైన 339 పరుగుల లక్ష్యాన్ని హర్మన్‌ప్రీత్ సేన అలవోకగా ఛేదించింది. ఈ క్రమంలో లీగ్ దశలో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం కూడా తీర్చుకుంది.

తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీమిండియా 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ఆశించిన స్థాయిలో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ షఫాలీ వర్మ 5 బంతుల్లో రెండు ఫోర్లతో 10 పరుగులు చేసి కిమ్ గార్థ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగింది. వన్‌డౌన్‌లో వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి మరో ఓపెనర్ స్మృతి మంధాన స్కోరును ముందుకు నడిపించింది. ఇద్దరు ధాటిగా ఆడుతూ స్కోరును పరిగెత్తించారు. కానీ 24 బంతుల్లో రెండు ఫోర్లు, సిక్సర్‌తో 24 పరుగులు చేసిన మంధానను కిమ్ గ్రాథ్ వెనక్కి పంపింది. దీంతో భారత్ 59 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది.

#### జెమీమా, హర్మన్ అద్భుత పోరాటం..

ఈ దశలో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్ తమపై వేసుకున్నారు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లపై ఎదురు దాడి చేస్తూ ముందుకు సాగారు. వీరికి ఔట్ చేసేందుకు కంగారూ బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటు జెమీమా అటు హర్మన్ తమ మార్క్ షాట్లతో చెలరేగి పోయారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. వీరిద్దరూ కుదురు కోవడంతో భారత్ లక్ష్యం దిశగా సాగింది. ఆరంభంలో జెమీమా దూకుడుగా ఆడింది. హర్మన్ సమన్వయంతో ఆడుతూ జెమీమాకు అండగా నిలిచింది. ఇదే సమయంలో ఇద్దరు అర్ధ సెంచరీలను పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత జోరును మరింత పెంచారు.

హర్మన్, జెమీమా చారిత్రక ఇన్నింగ్స్‌తో భారత్‌ను పటిష్టస్థితికి చేర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ జట్టును గెలుపు దిశగా నడిపించారు.

వీరిని ఔట్ చేసేందుకు కంగారూ బౌలర్లు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ 88 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్లతో 89 పరుగులు చేసిపెవిలియన్ చేరింది. అప్పటికే జెమీమాతో కలిసి 156 బంతుల్లోనే మూడో వికెట్‌కు 167 పరుగులు జోడించింది. హర్మన్ ఔట్ అయినా జెమీమా తన పోరాటాన్ని కొనసాగించింది. ఆమెకు దీప్తి శర్మ, రిచా ఘోష్‌లు అండగా నిలిచారు. ధాటిగా ఆడినదీప్తి 17 బంతుల్లో 3 ఫోర్లతో 24 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగింది. చెలరేగి ఆడిన రిచా 16 బంతుల్లోనే రెండు సిక్స్‌లు, మరో 2 ఫోర్లతో 26 పరుగులు చేసింది. అమన్‌జోత్ కౌర్ 8 బంతుల్లో రెండు ఫోర్లతో అజేయంగా 15 పరుగులు సాధించింది. ఇక చారిత్రక బ్యాటింగ్‌ను ప్రదర్శించిన జెమీమా రోడ్రిగ్స్ 134 బంతుల్లో 14 ఫోర్లతో 127 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. చివరి వరకు క్రీజులో నిలిచిన జెమీమా టీమిండియాకు ఒంటిచేత్తో ఫైనల్‌కు చేర్చింది.

లిచ్‌ఫీల్డ్ శతకం.. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన



ఆస్ట్రేలియాను ఓపెనర్ ఫోయెబ్ లిచ్‌ఫీల్డ్, ఎలిసె పెర్రీ ఆదుకున్నారు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. లిచ్‌ఫీల్డ్ అసాధారణ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. చెలరేగి ఆడిన లిచ్‌ఫీల్డ్ 93 బంతుల్లోనే 17 ఫోర్లు, 3 సిక్సర్లతో 119 పరుగులు సాధించింది. పెర్రీ 88 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 77 పరుగులు చేసింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన అష్లే గార్డ్‌నర్ 46 బంతుల్లోనే 4 సిక్స్‌లు, మరో నాలుగు ఫోర్లతో 63 పరుగులు చేసింది.

కీలక సమయంలో భారత బౌలర్లు విజృంభించడంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 338 పరుగుల వద్ద ముగిసింది. టీమిండియా బౌలర్లలో శ్రీచరణి, దీప్తి శర్మ రెండు వికెట్లను పడగొట్టారు.

# ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

### మెల్‌బోర్న్ వేదికగా నేడు రెండో టీ20

### ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగనున్న భారత్

### అర్ష్‌దీప్ సింగ్ ను జట్టులోకి తీసుకునే చాన్స్

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వరణుడు మింగేయడంతో టీమిండియా మరో ఆసక్తికరమైన పోరుకు సిద్దమైంది. మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరిగే రెండో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన



తొలి మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు దుమ్మురేపారు. అదే జోరును రెండో టీ20లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. తొలి టీ20లో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు ఓ పేస్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో టీ20లో తమ కాంబినేషన్‌ను మార్చుకునే ఛాన్స్ ఉంది.మెల్ బోర్న్ పిచ్ సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది బౌన్సీ పిచ్. బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకుంటారు. మైదానం పెద్దది కాబట్టి స్పిన్నర్లు వికెట్లు తీయకపోయినా.. పరుగులు నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. పిచ్ కండిషన్స్‌ను పరిగణలోకి తీసుకుంటే.. టీమిండియా ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగవచ్చు. అప్పుడు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తీలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. అదనపు పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు.ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి టీ20లో ఈ ఇద్దరు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఏడాది పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చాడు. తనకు అచ్చొచ్చిన ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగి దుమ్మురేపాడు. తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ కొనసాగనుండగా.. వికెట్ కీపర్‌గా సంజూకు ప్రాధాన్యత దక్కనుండటంతో జితేష్ శర్మకు మరోసారి నిరాశే ఎదురు కానుంది. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. తొలి టీ20లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను ఆడించడం విమర్శలకు దారి తీసింది. కానీ అతను బ్యాటింగ్ చేయడంతో పాటు ఆసీస్ కండిషన్స్‌లో బాగా రాణించగలడనే కారణంతో తుది జట్టులోకి తీసుకున్నారు. మరోసారి బుమ్రాకు తోడుగా అతన్నే కొనసాగించనున్నారు.

#### రెండో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి/అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.

#### ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత టీ20 జట్టు:

సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.

# నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను

### భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్

సిడ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై తాజా సమాచారం ఇచ్చారు. గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో ఉన్న అయ్యర్ ప్రస్తుతం కోలుకుంటున్నట్లు తెలిపారు. దీని గురించి శ్రేయాస్ అయ్యర్ సోషల్ మీడియా పోస్ట్‌ను షేర్ చేస్తూ, "నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను. రోజురోజుకూ మెరుగుపడుతున్నాను. మీ నుంచి నాకు లభించిన మద్దతుకు నేను చాలా కృతజ్ఞుడను. నన్ను మీ ఆలోచనల్లో ఉంచుకున్నందుకు ధన్యవాదాలు" అంటూ శ్రేయాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దీంతో శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. ఆయన కోలుకుంటున్నందున, డిశ్చార్జ్ అయి మరో వారంలో భారతదేశానికి తిరిగి రావొచ్చు. ముంబైలో ఆయన చికిత్స కొనసాగించే అవకాశం కూడా ఉంది. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో, హర్షిత్ రాణా వేసిన బంతిని అలెక్స్ కారీ అద్భుతమైన షాట్ కొట్టాడు. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో నిలబడి ఉన్న అయ్యర్ వేగంగా పరిగెత్తి డైవింగ్ క్యాచ్ తీసుకున్నాడు. ఈ డైవింగ్ సమయంలో, అతని ఎడమ పక్కటెముకలకు తీవ్ర గాయం అయింది. దీని వల్ల అతని ప్లీహము (ప్లీహము) పైన ఉన్న అవయవంలో అంతర్గత రక్తస్రావం జరిగింది. దీని కారణంగా, అతను అస్వస్థతకు గురయ్యాడు.



స్కానింగ్ నివేదికలో శ్రేయాస్ అయ్యర్ ప్లీహములో కొంత భాగం చీలిపోయినట్లు తేలింది. అందువల్ల, అతను ఇంటర్వెన్షనల్ ట్రాన్స్-కాథెటర్ ఎంబోలైజేషన్ చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, ఐసీయూ నుంచి వార్డుకు మార్చారని సమాచారం. శ్రేయాస్ అయ్యర్ మరో వారం రోజుల్లో భారత్ కు తిరిగి వస్తారని సమాచారం. ప్రస్తుతం వైద్య పర్యవేక్షణలో ఉన్న శ్రేయాస్ అయ్యర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలు పడుతుందని తెలిసింది. అందుకే, నవంబర్‌లో జరగనున్న దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ కనిపించడు. జనవరి నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లయితే మాత్రమే అతను న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో కూడా కనిపిస్తాడు.

# మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం






శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు.

ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు.

ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.




## మార్చి 19న లాక్ చేసిన టాక్సిస్

'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్‌ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం,హిందీ భాషల్లో విడుదల కానుంది.

# నా నటనకు రిటైర్మెంట్ లేదు

### - మాస్ జాతర హీరో రవితేజ

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు.

తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు.ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు.


మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.



# రాజమౌళి-మహేశ్‌బాబు కాంబో

## కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి

రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టే ముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది



మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం

# నేడు బాహుబలి: ది ఎపిక్ విడుదల

### బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్'లో అవంతిక లవ్ స్టోరీ, కొన్ని పాటలు, కొన్ని సన్నివేశాలు కటింగ్‌లో తొలగించాం. కథాంశాన్ని మరింత సూటిగా చూపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం అని తెలిపారు. అలాగే, అందరూ బాహుబలి 3 వస్తుందని అనుకుంటున్నారని ప్రస్తావిస్తూ, అది కాదు అని స్పష్టంచేశారు. కానీ, ఒక స్పెషల్ సర్ప్రైజ్‌ను మాత్రం కన్ఫర్మ్ చేశారు. రాజమౌళి వెల్లడించిన ప్రకారం, బాహుబలి ఎపిక్ వెర్షన్ ఇంటర్వెల్‌లో 3డి యానిమేషన్ టీజర్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ టీజర్ ద్వారా బాహుబలి యూనివర్స్ కొనసాగనుందని చెప్పారు. ఈ యానిమేషన్ సీక్వెన్స్ దర్శకుడు ఇషాన్ శుక్లా రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.




PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154